

ప్లాంటేషన్ పరిశీలన

కారేపల్లి మండలంలోని అటవీ ప్లాంటేషన్‌ను పోడుదారులు నరికివేసిన నేపథ్యాన ఉన్నతాధికారులు పరిశీలించారు. 8లో



చెరువు శిఖంలో కూల్చివేతలు

ఖమ్మంలోని ఖానాపురం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతి లేకుండా నిర్మించారంటూ పలు కట్టడాలను కూల్చివేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 19°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కాస్త చలి ప్రభావం ఉండే అవకాశముంది.





పదపదవే గాలిపటమా..

జిల్లాలో సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. విద్యా సంస్థలకు శుక్రవారం నుంచి సెలవులు మొదలుకానుండడంతో విద్యార్థులు గాలిపటాలు ఎగురవేసేందుకు ఆసక్తి చూపనున్నారు. దీంతో వ్యాపారులు వివిధ రంగుల్లోనే కాకుండా ఆకర్షణీయమైన రూపాల్లో గాలిపటాలను అమ్మకానికి సిద్ధం చేశారు. ఇక వీటిని ఎగురవేయడమే పిల్లల వంతు!

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్





న్యూస్‌రీల్

రిసెప్షనిస్టుల పాత్ర కీలకం



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: సమస్యలతో పోలీసుస్టేషన్లకు వచ్చే వారి నుంచి వివరాలు, ఫిర్యాదుల స్వీకరణలో రిసెప్షనిస్టుల పాత్ర కీలకమైనదని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. రిసెప్షన్ సెంటర్ల సిబ్బందికి గురువారం శిక్షణ ఇవ్వగా సీపీ మాట్లాడారు. స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాదగా పలకరించి సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని, ఎక్కడా విమర్శలకు తావివ్వకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతీ ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అంతేకాకుండా ఫిర్యాదుల స్థితిగతులను రికార్డుల్లో నమోదు చేయాలని సీపీ సూచించారు. కాగా, గత ఏడాది గుండెపోటుతో మృతిచెందిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ హసన్ అలీ కుటుంబసభ్యులకు మంజూరైన రూ.8లక్షల భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కును ఆయన కుటుంబీకులకు సీపీ సునీల్‌దత్ అందజేశారు. ఏఓ అక్తరున్నీసాబేగం తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు కరకట్టలపై మరోసారి సర్వే

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరానికి వరద ముంపు లేకుండా మున్నేరుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన విషయం విదితమే. ఇప్పటికే రూ.680 కోట్ల నిధులు కేటాయించగా, భూసేకరణ కోసం నాలుగు రోజులుగా అధికారులు సర్వే చేస్తున్నారు. ఖమ్మం నగరం వైపు 64, ఖమ్మం రూరల్ మండలం వైపు 24 కట్టడాలు సేకరించాలని, మొత్తంగా 194 ఎకరాల భూమి అవసరముందని అధికారులు అంచనా వేశారు. అయితే, సేకరించాల్సిన భూమిలో మురుగునీరు ప్రవహించే కాల్వలు, ప్రైవేట్ కట్టడాలు ఉన్నాయి. దీంతో ప్రైవేట్ కట్టడాలు కాకుండా భూమి మాత్రం సేకరించేలా సర్వే చేయాలని కలెక్టర్ సూచించడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఖమ్మం వైపు 64 కట్టడాల్లో 38, ఖమ్మం రూరల్‌లో 24 కట్టడాల్లో 21 తగ్గించడమే కాక 171ఎకరాల భూసేకరణకు నివేదిక సిద్ధం చేశారు.

మత్స్యకారులకు శిక్షణ



మేత తయారీ విధానాన్ని వివరిస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో 'చేపల మేత తయారీ–యాజమాన్య పద్ధతులు' అంశంపై మత్స్యకారులకు శిక్షణ కొనసాగుతోంది. ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, రాజన్న సిరిసిల్ల, మెదక్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల మత్స్యకారులు పాల్గొనగా రెండో రోజైన గురువారం శాస్త్రవేత్తలు శాంతన్న, గణేష్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. చేపల మేత తయారీ, ఉపయోగించాల్సిన పదార్థాలు, చేపలు పట్టే సమయాన తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, మత్స్య శాస్త్రవేత్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ 2022 మార్చి 31 లోపు ఈ–శ్రామ్‌లో పేరు నమోదు చేసుకుని ప్రమాదవశాత్తు మరణించిన, గాయపడిన కార్మికులకు పరిహారం అందించనున్నట్లు కార్మిక శాఖ సహాయ కమిషనర్ చల్లా వెంగమ్మ తెలిపారు. బాధితుల కుటుంబీకులు 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరణ ధృవపత్రం, ఆధార్ కార్డు, ఈ–శ్రామ్ కార్డు, ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదిక, వైద్య ధృవపత్రం, నామినీ బ్యాంక్ ఖాతాతో తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని తెలిపారు.

కదులుతున్న పీఠం

డీసీసీబీ చైర్మన్ కూరాకులకు పదవీ గండం!

- వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్‌గా ఆయనపై అవిశ్వాసం
- అక్కడ చైర్మన్‌గిరీ కోల్పోతే డీసీసీబీ పదవి నుంచి తొలగింపు
- చైర్మన్ కుర్చీ కోసం పలువురి యత్నాలు



ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషణం పదవికి ముప్పు ఏర్పడింది. ఆయన చైర్మన్‌గా ఎన్నికైన రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం పీఏసీఎస్ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాన నోటీసును గురువారం డీసీఓకు అందజేశారు. మెజార్టీ డైరెక్టర్లు అవిశ్వాసం కోరిన నేపథ్యాన నిబంధనల మేరకు అధికారులు పదిహేను రోజుల్లోగా సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఆ సమావేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గితే కూరాకుల పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ పదవినీ కోల్పోనున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయాన 2020 ఫిబ్రవరి 15న జరిగిన సహకార సంఘం ఎన్నికల్లో వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్‌గా నాగభూషణం ఎన్నికయ్యారు. డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉండగా, వంద మంది పీఏసీఎస్ చైర్మన్లు డీసీసీబీ పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ పాలకవర్గానికి మరో 14 నెలల సమయం ఉండగా.. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది.

అవిశ్వాసానికి నోటీసు

వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్న కూరాకుల నాగభూషణంపై సంఘం డైరెక్టర్లు తిరుగుబావుటా ఎగురవేశారు. సంఘంలోని 13 మందికి గాను 11 మంది డైరెక్టర్లు నాగభూషణంపై అవిశ్వాసం ప్రకటిస్తూ గురువారం జిల్లా సహకార అధికారి(డీసీఓ) విజయకుమారికి నోటీసు అందజేశారు. దీంతో ఆమె పదిహేను రోజుల వ్యవధిలో సమావేశం నిర్వహించి డైరెక్టర్ల అభిప్రాయాలు తెలుసుకుంటామని వెల్లడించారు. అవసరమైతే తిరిగి ఎన్నిక నిర్వహిస్తామని.. మూడింట రెండొంతుల మెజార్టీ ఉన్న వారికి చైర్మన్ పదవి దక్కుతుందని తెలిపారు.

ఆ పదవి పోతే ఈ పదవి కూడా..

రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్ పదవిని నాగభూషణం కోల్పోతే డీసీసీబీ చైర్మన్ పదవి నుంచి తొలగిస్తారు. అనంతరం వైస్ చైర్మన్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి నిర్ణీత వ్యవధిలో నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుత వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారు.



డీసీఓకు నోటీసు అందిస్తున్న వీ.వీ.పాలెం పీఏసీఎస్ డైరెక్టర్లు

20 మందిలో 18 మంది డైరెక్టర్లు..

డీసీసీబీ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు పలువురు తెరచాటున యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యాన పాలకవర్గంలో మార్పులు చోటుచేసుకునే అవకాశముంది. డీసీసీబీకి 20 మంది డైరెక్టర్లు ఉండగా వీరిలో పీఏసీఎస్‌ల చైర్మన్లు 16 మంది, వ్యవసాయేతర సంఘాలకు చెందిన నలుగురు డైరెక్టర్లుగా ఉన్నారు. అయితే ఇందులో ఒక ఎస్టీ డైరెక్టర్ పదవి ఖాళీగా ఉండగా, ఇటీవలే ముదిగొండ సొసైటీకి చెందిన డైరెక్టర్ వేముల శ్రీనివాస్ కన్నుమూశారు. దీంతో మిగిలిన డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశముంది. ఇందులో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలే కాక జనసేన, సీపీఎం వారూ ఉన్నారు. ప్రస్తుతానికి బీఆర్ఎస్‌కే బలం ఉన్నా.. పరిస్థితులు ఎలా మారతాయో తెలియాల్సి ఉంది.

తుళ్లూరి బ్రహ్మయ్యకు చాన్స్?

భద్రాద్రి జిల్లా అశ్వాపురం పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేస్తూ డీసీసీబీ పాలకవర్గంలో డైరెక్టర్‌గా ఉన్న తుళ్లూరి బ్రహ్మయ్యకు డీసీసీబీ చైర్మన్ పదవి దక్కే అవకాశముందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ అధిష్టానం బ్రహ్మయ్యకు ప్రాధాన్యత ఇవ్వడమే కాక మరికొందరి పేర్లనూ పరిశీలిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌లో ఉన్న బ్రహ్మయ్య ఏడాది క్రితం కాంగ్రెస్‌లో చేరారు. 2020లో కూరాకులను డీసీసీబీ చైర్మన్‌గా నియమించిన సమయాన బ్రహ్మయ్య పేరు కూడా వినిపించింది. ప్రస్తుతం పరిస్థితుల్లో బ్రహ్మయ్య పేరును అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, కూరాకుల ప్రాతినిధ్యం వహిస్తున్న వీ.వీ.పాలెం సహకార సంఘానికే తిరిగి చైర్మన్ పదవి కట్టబెడతారనే చర్చ కూడా సాగుతోంది.

నాడు ఏకగ్రీవం.. నేడు అవిశ్వాసం

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికైన కూరాకుల నాగభూషణం డీసీసీబీ చైర్మన్ పదవి దక్కించుకోవడం ప్రాముఖ్యత చాటుకుంది. 2020లో జరిగిన ఎన్నికల సమయాన నాగభూషణాన్ని డీసీసీబీ చైర్మన్‌ను చేయాలనే భావనతో వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పుడు అదే చైర్మన్‌పై వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావుతో పాటు మొత్తం 11 మంది డైరెక్టర్లు గురువారం డీసీఓ విజయకుమారికి అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. చైర్మన్‌తో పాటు మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా, 11 మంది నోటీసుపై సంతకాలు చేశారు. నోటీసు ఇచ్చిన వారిలో డైరెక్టర్లు రావూరి సైదుబాబు, గుండె ఆదినారాయణ, ఎం.నాగేశ్వరరావు, టి.భాష్‌సింగ్, జె.అనిత, బి.వెంకన్న, జి.ముత్తిలింగం, గుడ్ల సుగుణ, రావెళ్ల శ్రీనివాసరావు, రామారావు, సీహెచ్.మురళీకృష్ణ ఉన్నారు. డీసీఓను కలిశాక వారు విలేకరులతో మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం చైర్మన్‌గా ఏకగ్రీవంగా గెలిపించుకుంటే డైరెక్టర్లుగా తమకు ఎలాంటి గుర్తింపు, సమాచారం లేకుండా పనులు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల వీరభద్రం, చావా నారాయణరావు, పొట్ల వీరేందర్, యరగర్ల హన్మంతరావు, కమర్తపు మురళి, నెల్లూరి కోటేశ్వరరావు, చంద్ర రాంబాబు, గుర్రం జగన్, ఆనంద్, తమ్మిన్ని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీతారామ పూర్తి చేయడమే నా లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- యాతాలకుంట టన్నెల్ పరిశీలన, అధికారులతో సమీక్ష
- ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశం
- రూ.70 కోట్లు ఇవ్వాలని భట్టికి విజ్ఞప్తి



టన్నెల్‌లో పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యేలు రాగమయి, అధికారులు

సత్తుపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలంగా మార్చే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈమేరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్‌లో జరుగుతున్న పనులను సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, జారె ఆదినారాయణతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. నెలకు వంద మీటర్ల పనులు జరుగుతున్నందున ఏడాదికల్లా పూర్తవుతుందని అధికారులు తెలిపారు. అయితే, రెండువైపుల నుంచి టన్నెల్ పనులు చేస్తూ వేగం పెంచాలని మంత్రి సూచించారు. సాంకేతిక, ఆర్థిక సమస్యలు ఉంటే సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి నిధులు ఇప్పిస్తానని తెలిపారు. జూన్ కల్లా స్ట్రక్చర్ పనులు పూర్తి చేసేలా యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

టన్నెల్ పూర్తయితే...

యాతాలకుంట టన్నెల్ నిర్మాణం పూర్తయితే బేతుపల్లి చెరువులో గోదావరిజలాలు పారుతాయని.. సత్తుపల్లి, వేంసూరు మండలాలకు సాగునీటి ఇక్కట్లు తీరడమే కాక లంకాసాగర్‌కు సాగునీరు విడుదల చేయొచ్చని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీతారామ ప్రాజెక్టు కాల్వ పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించిన మంత్రి ఆతర్వాత విలేకరులతో మాట్లాడారు. బూర్గంపాడు, పూసుగూడెం, కమలాపురం పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తయిందని, గండుగులపల్లి పంపుహౌస్ నిర్మాణ దశలో ఉందని తెలిపారు. ఇది కూడా పూర్తయితే దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు సాగునీరు సరఫరా అవుతుందని వెల్లడించారు.

డిప్యూటీ సీఎం భట్టికి ఫోన్

యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులకు భూసేకరణ అడ్డంకిగా ఉన్నందున తక్షణమే రూ.70 కోట్లు మంజూరయ్యేలా చూడాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఫోన్‌లో తుమ్మల కోరారు. ఈ టన్నెల్ పూర్తయితే మధిర బ్రాంచ్ కెనాల్ పరిధిలో కూడా వచ్చే ఏడాదికల్లా లక్ష ఎకరాలకు నీరు ఇవ్వొచ్చని వివరించారు. సంక్రాంతి లోపు భూసేకరణ సమస్య పరిష్కరించాలని కోరగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, సీతారామ ప్రాజెక్టు ఎస్ఈ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఈఈలు కె.సురేష్‌కుమార్, శ్రీనివాసాచారి, అధికారులు డి.చంద్రశేఖర్, జి.మోతీలాల్, ఎల్.కృష్ణ, పి.చంద్రస్వామి, నర్సింహారావు, గఫూర్, కృష్ణ, సాగర్ పాల్గొన్నారు.

వైద్యవృత్తి మహోన్నతమైనది..

- ఎంబీబీఎస్ పూర్తయ్యాక సమాజ హితానికి పాటుపడండి
- మెడికల్ కాలేజీ ఫ్రెషర్స్ డేలో కలెక్టర్ గౌతమ్



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమ్మం వైద్యవిభాగం: అన్నింటిల్లో కెల్లా వైద్యవృత్తి మహోన్నతమైనదని.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని భవిష్యత్‌లో సమాజ హితానికి పాటుపడాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ.లక్షల్లో వెచ్చిస్తున్నందున బాధ్యతగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఇదే మొదటి బ్యాచ్ అయినందున ర్యాగింగ్ బెడద ఉండదని.. వచ్చే ఏడాది వచ్చే విద్యార్థులకు సైతం ఇదే వాతావరణం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ తొలి ఏడాది విద్యార్థులు బాధ్యతగా చదివి మిగతా బ్యాచ్‌లకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించగా.. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీసీహెచ్ఎస్ బి.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓలు డాక్టర్ అమర్‌సింగ్, డాక్టర్ రాంబాబు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ సరిత, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మిర్చితోటల పరిశీలన

- పలు ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు, శాస్త్రవేత్తలు
- మంత్రి తుమ్మల ఆదేశంతో జిల్లాకు..
- పంట తెగుళ్ల బారిన పడినట్లు గుర్తింపు



ముదిగొండ మండలం రాఘవాపురంలో మిర్చి తోటను పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఖమ్మంవ్యవసాయం/రఘునాథపాలెం/ముదిగొండ/చింతకాని/: మిర్చి ధర పతనమవుతున్న నేపథ్యాన రాష్ట్ర ఉద్యాన, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తల బృందం గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. గత నెలతో పోలిస్తే క్వింటా మిర్చి ధర రూ.4,500ల వరకు పడిపోగా రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. దీంతో రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై మిర్చి రైతులు నష్టపోకుండా చూడాలని ఆదేశించారు. ఈక్రమంలో ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్త టి.సురేష్, ఉద్యాన, వ్యవసాయ శాఖల డీడీలు వేణుగోపాల్, ఎన్.మోహన్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు రవి, శైలజతో కూడిన బృందం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మిర్చి తోటలను పరిశీలించింది. రఘునాథపాలెం మండలంలోని రాంక్యా తండా, ఈర్లపూడి, మంచుకొండ, ముదిగొండ మండలం రాఘవాపురం, చింతకాని మండలం వందనం, తల్లాడ మండలం నారాయణపురం గ్రామాల్లో సాగు చేసిన మిర్చి తోటలను పరిశీలించి... గత డిసెంబర్‌లో కురిసిన అకాల వర్షాలతో తోటలు తెగుళ్ల బారిన పడ్డాయని గుర్తించారు. కాయపై మచ్చలు రావడంతో పాటు దిగుబడి తగ్గిందని తేల్చారు. కొంతమేర పంట నాణ్యత కూడా కోల్పోయిందని బృందం వెల్లడించింది. అధిక నత్రజని వినియోగం కూడా ఇందుకు ఓ కారణంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా సస్యరక్షణ చర్యలు, పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పరిశీలనలో డీఏఓ ఎం.విజయనిర్మల, ఖమ్మం ఉద్యాన శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.రమణ, మార్కెటింగ్ శాఖ జేడీ వి.శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీం, ఏడీఏ సరిత, అధికారులు కె.మీనాక్షి, శ్రీనివాసరావు, భాస్కర్‌రావు, మందుల రాధ, రామకృష్ణ, నగేష్, మౌనిక, కె.వెంకటేశ్వరరావు, పల్లెల నాగయ్య, నవీన్ పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌లో పరిశీలన

రాష్ట్ర ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తల బృందం శుక్రవారం ఖమ్మం మార్కెట్‌ను సందర్శించనుంది. ఈ సందర్భంగా రైతులు తీసుకొస్తున్న మిర్చి, నాణ్యత, ధరలను పరిశీలించనున్నారు. వ్యాపారులు ఏ ప్రాతిపదికన ధరలు ఖరారు చేస్తున్నారో కూడా వారు ఆరా తీసే అవకాశముంది.

ప్రభుత్వ స్థలాల రక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ప్రభుత్వ స్థలాల రక్షణ దిశగా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం నగర పరిధిలో విలువైన ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాల మేరకు అన్నిచర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, నీటిపారుదల, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో అభివృద్ధి పనుల కోసం ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ స్థలాలను కాపాడాలని తెలిపారు. ఈమేరకు కేఎంసీ కమిషనర్ చైర్మన్‌గా, ఆర్డీఓ మెంబర్ కన్వీనర్‌గానే కాక ఇతర శాఖల అధికారులు సభ్యులుగా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. అలాగే, క్షేత్ర పరిధిలో పరిశీలనకు నాలుగు బృందాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కాగా, ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరిస్తారని నమ్మిస్తూ అమాయకులను ఉసిగొల్పుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇక ఆక్రమణలపై ఫిర్యాదు చేసేందుకు కంట్రోల్ రూమ్ నంబర్లు 1077, 90632 11298 పై ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ జి.గణేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాసులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్ తతదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సత్తా

- మెరుగుపడిన కేఎంసీ ర్యాంక్
- జాతీయ ర్యాంక్ 141, రాష్ట్రస్థాయిలో 7
- మున్సిపాలిటీల ర్యాంకులు మాత్రం కిందకు...

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటించాయి. 2023 ఏడాదికి గాను ప్రకటించిన ర్యాంకుల్లో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ స్థానం మెరుగుపడింది. జాతీయ స్థాయిలో 141, రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంక్ సాధించింది. ఆరు అంశాల్లో ప్రగతిని పరిశీలించి కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ర్యాంకులను కేటాయించారు. 2022 ఏడాదిలో కేఎంసీకి జాతీయ స్థాయిలో 155 ర్యాంకు రాగా ఈసారి మెరుగుపడి 141వ స్థానంలో నిలిచింది. అదే ఏడాది రాష్ట్రంలో 12వ ర్యాంక్ సాధించగా.. ఈసారి 7వ ర్యాంక్ సాధించడం విశేషం. కేఎంసీ పరిధిలో ఇంటింట చెత్త సేకరణ 99 శాతం జరుగుతుండగా.. చెత్త సెగ్రిగేషన్ 99 శాతం, ప్రాసెసింగ్ 61 శాతం, నివాస ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతాలు, పబ్లిక్ టాయిలెట్లలో 100 శాతం పరిశుభ్రతను పాటిస్తుండడంతో ర్యాంకులు మెరుగయ్యాయి.

పడిపోయిన మున్సిపాలిటీల ర్యాంకులు..

కార్పొరేషన్లతో పాటు మున్సిపాలిటీలకు సైతం ప్రభుత్వాలు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటించాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు మున్సిపాలిటీలకు ర్యాంకులను కేటాయించాయి. జాతీయ, జోనల్, స్టేట్ ర్యాంకులను కేటాయించగా.. 2022తో పోలిస్తే 2023లో అన్నింటి ర్యాంకులు పడిపోయాయి. కాగా, జోనల్ స్థాయిలో మాత్రం సత్తుపల్లి, ఇల్లెందు మున్సిపాలిటీల ర్యాంకు కాస్త మెరుగైంది.

మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు

మున్సిపాలిటీ	జాతీయ ర్యాంక్	జోనల్ ర్యాంక్		రాష్ట్ర ర్యాంక్	
	2023	2022	2023	2022	2023
మధిర	1,325	121	158	40	126
వైరా	3,062	187	256	41	131
సత్తుపల్లి	1,257	73	52	37	98
కొత్తగూడెం	1,060	35	43	25	75
పాల్వంచ	1,128	11	50	09	81
ఇల్లెందు	537	18	11	16	20
మణుగూరు	2,280	52	153	34	124

క్లుప్తంగా

టీపీజేఎంఏ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శేషగిరి, జగదీష్


చల్లా శేషగిరి


గొల్లపుడి జగదీష్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీజేఎంఏ) ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎక్సలెంట్ కళాశాల కరస్పాండెంట్ చల్లా శేషగిరిరావు, కార్యదర్శిగా కృష్ణవేణి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ గొల్లపుడి జగదీష్ ఎన్నికయ్యారు. అలాగే, కోశాధికారిగా ఎస్.వీరభద్రం, ఈసీ–1, 2లుగా ఎం.వీరారెడ్డి, పి.ప్రవీణ్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈసీ–1 ఎం.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎం.అనిల్‌కుమార్, ఎం.దుర్గారావు, ఎం.మామంద్రరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాయల సతీష్‌బాబు, ఎం.నాగిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎం.చైతన్య, ఎం.రవి ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎన్నికకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.తిరుపతిరెడ్డి పరిశీలకులుగా హాజరు కాగా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని దత్తత తీసుకున్న బెంగళూరు వాసులు

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని శిశుగృహ సంరక్షణలో ఉన్న ఆరు నెలల పాపను బెంగళూరుకు చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆ పాపను దంపతులకు అప్పగించినట్లు జిల్లా సంక్షేమ అధికారి టి.సుమ తెలిపారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, జిల్లా బాలల సంరక్షణ అధికారి విష్ణు వందన తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి దత్తత కోసం దరఖాస్తు చేసుకోవచ్చు..

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఊయలలో ఈనెల 10న గుర్తు తెలియని వ్యక్తులు పదిహేను రోజులు వయసు గల ఆడ శిశువును వదిలి వెళ్లగా శిశుగృహకు తీసుకెళ్లి సంరక్షిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సుమ తెలిపారు. ఈమేరకు పాపను దత్తత తీసుకునేందుకు ఆసక్తి ఉన్నవారు cara.wcd.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం 83329 68750, 83329 68751/52/53 నంబర్లలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

కలెక్టర్ అభినందన


క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్

ఖమ్మంస్పోర్ట్స్: జాతీయస్థాయి పాఠశాలల క్రీడాపోటీల్లో పాల్గొన్న జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారులను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ గురువారం అభినందించారు. జిల్లా నుంచి అండర్–17 విభాగంలో ప్రాతినిధ్యం వహించిన సీహెచ్. చైత్ర, కిరణ్మయి, భవన, హర్షశ్రీ, సీహెచ్.చెన్నకేశవ, ఖాసీం బీ, నవ్యశ్రీని కలెక్టర్ అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కల్యాణపు ఆదర్శ్‌కుమార్, పీఈటీలు జి.నాగేశ్వరరావు, ఎస్.కే.ముజాహిద్ పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన సీపీ


జడ్జికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీపీ

ఖమ్మం లీగల్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్‌ను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం జడ్జిని కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి పలు అంశాలపై మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక


శశిధర్

ఖమ్మం సహకారనగర్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్(టీఎస్‌సీపీఎస్ఈయూ) జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చంద్రకంటి శశిధర్ రెండోసారి ఎన్నిక కాగా... ప్రధాన కార్యదర్శిగా గార నర్సింహారావు, కోశాధికారిగా జక్కుల యాకూబ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ముక్తవరం శ్వేత ఎన్నికయ్యారు. అలాగే, అసోసియేట్ అధ్యక్షుడిగా చర్ల శ్రీనివాసరావుతో పాటు ఎస్.కే.వహీద్, ఆర్.వెంకట్, భాను, ఎం.డీ.సుభాన్, సురేశ్, ఉమా నగేశ్, కె.పవన్‌కుమార్, రంగబాబు రవిను ఎన్నుకున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెం, ఏదులాపురంల్లో ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె స్టాక్ రిజిస్టర్లు, పీఓపీ యంత్రాలను పరిశీలించి యజమానులకు సూచనలు చేశారు. ప్రతీ అమ్మకంపై రైతులకు రశీదు ఇవ్వాలని, ధరల పట్టిక ప్రదర్శించడంతో పాటు స్టాక్ రిజిస్టర్లు పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బస్సుల్లో రద్దీతో ఆటోలో వెళ్తున్న విద్యార్థులు


లగేజీతో కొత్త బస్టాండ్‌కు వస్తున్న విద్యార్థినులు


బస్సు రావడంతో పరుగులు తీస్తున్న ప్రయాణికులు

పండుగ ప్రయాణం !

- విద్యాసంస్థలకు సెలవులు
- కిక్కిరిసిన బస్టాండ్లు

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించింది. దీంతో గురువారం సాయంత్రమే ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులను తల్లిదండ్రులు స్వగ్రామాలకు తీసుకెళ్లారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఖమ్మం కొత్త, పాత బస్టాండ్లకు లగేజీలతో తరలిరావడంతో రద్దీ నెలకొంది. ఏ బస్సు చూసినా కిక్కిరిసి పోగా, ప్లాట్‌ఫాంపై బస్సులు వస్తుండగానే సీటు దక్కించుకునేందుకు పరుగులు తీయడం కనిపించింది. కాగా, పండుగ రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ అధికారులు గురువారం నుంచి ప్రత్యేక సర్వీసులు ప్రారంభించారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు ఎక్కువ బస్సులు ఏర్పాటుచేయగా సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు తదితర ప్రాంతాలకు కూడా ప్రత్యేక సర్వీసులు మొదలయ్యాయి. బస్టాండ్లలో అధికారులు పర్యవేక్షిస్తూ రద్దీకి అనుగుణంగా అప్పటికప్పుడు మరిన్ని బస్సులు నడిపించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్ / ఖమ్మం మామిళ్లగూడెం


కిక్కిరిసిన ఖమ్మం పాత బస్టాండ్


కిటికిలోంచి పిల్లలను తీసుకుంటున్న ప్రయాణికురాలు

రాజ్యాంగ హక్కులు తొలగించేందుకు కుట్ర

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యాంగం కల్పించిన హక్కులను తొలగించేందుకు కేంద్రప్రభుత్వం కుట్ర చేస్తోందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ఆరోపించారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో గురువారం జరిగిన సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మతం, దేవుడిని అధికార యంత్రాంగంలోకి, రాజకీయాల్లోకి చొప్పించి ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని విమర్శించారు. అలాగే, ఎల్ఐసీ, రైల్వే, బీఎస్ఎన్ఎల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్ముందని పేర్కొన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే దేశభక్తులు కర్తవ్యంగా భావించాలని పిలుపునిచ్చారు. కాగా, వచ్చేనెల 10, 11వ తేదీల్లో ఖమ్మంనగరంలో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు స్కైలాబ్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, నాయకులు మాచర్ల భారతి, కొమ్ము శ్రీను, పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, మట్టి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వసతుల కల్పనకు రూ.3 లక్షలు


ఆట వస్తువులు అందిస్తున్న రామకృష్ణ, కుటుంబసభ్యులు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక ఉన్నత పాఠశాలలో వసతుల కల్పనకు రూ.3 లక్షలు విరాళం ఇస్తామని ఎన్నారై దేవిశెట్టి వెంకటరామకృష్ణ ప్రకటించారు. ఈమేరకు విద్యార్థులకు ఉపయోగపడే రూ.10 వేల విలువైన పుస్తకాలు, ఆట వస్తువులను గురువారం అందజేశారు. త్వరలోనే వివిధ పనులు చేపట్టేందుకు రూ.3 లక్షల నగదు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల గణిత ఉపాధ్యాయురాలైన దేవిశెట్టి సరస్వతి సోదరుడు వెంకటరామకృష్ణను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం శిరీష, ఉపాధ్యాయులతో పాటు వెంకటరామకృష్ణ కుమార్తెలు నిత్య, లేశ తదితరులు పాల్గొన్నారు.

‘గురుకుల రినాయ్‌సెన్స్’లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి


ప్రథమ బహుమతి పొందిన విద్యార్థుల బృందం

కల్లూరు: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో రినాయ్‌సెన్స్ రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 8 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించగా ఖమ్మం రీజియన్ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. రాష్ట్ర స్థాయిలో 13 రీజియన్ల నుంచి జట్లు పాల్గొనగా ఖమ్మం రీజియన్ యూత్ పార్లమెంట్‌లో మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఖమ్మం రీజియన్ జట్టులో కల్లూరు గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.జయసింధూర, జి.సుకన్య, వి.మంజుల, ఎస్.సాయిదీక్షిత, ఎం.శ్రావణి, ఈ.ఉషశ్రీ, వి.జాహ్నవి, నాగశ్రావ్య ఉన్నారు. అలాగే, వక్తృత్వ పోటీల్లో కల్లూరు గురుకులానికి చెందిన డి.లక్ష్య ప్రథమ స్థానం సాధించగా విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.శ్రీలత, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్రాంతి సంబురాల్లో మంత్రి తుమ్మల


మంత్రిని సన్మానిస్తున్న ఐఎంఏ బాధ్యులు

ఖమ్మం వైద్యవిభాగం: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మం లేక్ వ్యూ క్లబ్‌లో గురువారం సాయంత్రం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కుల, మత, వర్గాలకతీతంగా సంక్రాంతి సంబురాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కాగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కబ్జాలు, బెదిరింపులు, రౌడీయిజం లేని ప్రశాంతమైన ఖమ్మంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఈ వేడుకలకు మంత్రి సహా పలువురు వైద్యులు పంచెకట్టులో హాజరు కావడం విశేషం. ఐఎంఏ అధ్యక్షుడు కంభంపాటి నారాయణరావుతో పాటు గుబ్బల స్వప్న, వాసిరెడ్డి రామనాథం, కూరపాటి ప్రదీప్, కుసుమరాజు రవికుమార్, సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, మిక్కిలినేని నరేందర్, ఎస్.కే.అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజన ఉత్సవాలకు ఎంపిక


నాసిక్‌లో జిల్లా బృందం

నేలకొండపల్లి: స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో శుక్రవారం మొదలయ్యే యువజనోత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. నేలకొండపల్లి మండలంలోని బోదులబండకు చెందిన ఎన్‌వైకే వలంటీర్ సంద సుధీర్‌కుమార్ ఈ బృందానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనుండగా డి.వెంకటగణేష్, జి.అఖిల్, సాయిశ్రీనిక, జి.వసంతశేషసాయి, కనకపూడి అఖిల, తునికపాటి తిరుమలాచారికి స్థానం దక్కింది. కాగా, ఈ బృందం సభ్యులు గురువారం నాసిక్‌కు చేరుకున్నారు.

అటవీ ప్లాంటేషన్‌ను పరిశీలించిన రాష్ట్ర అధికారులు


ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

కారేపల్లి: మండలంలోని ఎర్రబోడు ప్రాంతం ఊటవాగు సమీపాన అటవీ ప్లాంటేషన్‌ను కొందరు ఇటీవల ధ్వంసం చేయగా, ఆరుగురిని అరెస్ట్ చేసే క్రమంలో బుధవారం గొడవ జరిగింది. దీంతో ఊటవాగు వద్ద ఫారెస్టు ప్లాంటేషన్‌ను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) విజిలెన్స్ అధికారి ఎలుసింగ్ మీర్, సీసీఎఫ్ బీమానాయక్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ తదితరులు గురువారం పరిశీలించారు. సుమారు తొమ్మిది హెక్టార్లలో 8,009 మొక్కలను నరికేశారని కారేపల్లి ఎఫ్ఆర్ఓ సిద్ధార్థరెడ్డి వివరించారు. ఈ సమయాన పోడుదారులు వచ్చి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా అధికారులు నిరాకరించారు. ఎఫ్‌డీఓలు బి.బాబు, నాగభూషణం, డీఎఫ్ఓ(విజిలెన్స్) రాజశేఖర్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో ఆత్మహత్యాయత్నం

ముదిగొండ: తండ్రితో ఉన్న ఆస్తితగాదాల కారణంగా ఖమ్మంకు చెందిన కృష్ణప్రసాద్ ముదిగొండలోని గురువారం ఓ పెట్రోల్ బంక్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది, వాహనదారులు ఆయన ఒంటిపై నీళ్లు పోసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. అనంతరం పోలీసులు కృష్ణప్రసాద్‌ను తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా, దౌర్జన్యంగా బంక్‌లోకి వచ్చిన ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బంకు మేనేజర్ అన్వేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ అంపైర్‌గా మల్లికార్జున్


మల్లికార్జున్

ఖమ్మం స్పోర్ట్స్: ఢిల్లీలో ఈ నెల 16 నుంచి జరిగే ఇండియా ఓపెన్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ అంపైర్‌గా కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన టి.మల్లికార్జున్ ఎంపికయ్యారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో జరిగిన జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలకు గ్రేడ్–1 అంపైర్‌గా ఆయన వ్యవహరించారు. ఇప్పుడు అంతర్జాతీయ టోర్నీకి ఎంపికవడంపై బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్, ఏఏస్పీ జి.వెంకట్రావు, అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని వెంకట్రావు, ఎస్.ఉప్పల్‌రెడ్డితో పాటు సత్యనారాయణమూర్తి, నల్లమోతు రఘు, రమణ, రామారావు తదితరులు అభినందించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన డీసీఎం వ్యాన్


ఘటనాస్థలిలో బస్సు, వ్యాన్

నేలకొండపల్లి: ఆర్టీసీ బస్సును డీసీఎం వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో పెనుప్రమాదం తప్పగా ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి ఖమ్మం వస్తున్న బస్సు నేలకొండపల్లి బ్యాంక్ సమీపంలోకి చేరుకోగానే కోదాడ నుంచి ఖమ్మం వైపు అతి వేగంగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. బ్యాంక్‌కు వచ్చిన వినియోగదారులు మార్జిన్ దాటి రోడ్డుపై వాహనాలు నిలపడంతో బస్సు డ్రైవర్ డివైడర్‌కు దగ్గరగా వెళ్తున్నారు. అదే సమయాన డీసీఎం వేగంగా వచ్చి ఓవక్క నిలిపిన వాహనాలు, బస్సును తప్పించే క్రమంలో ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడినా ఆందోళనకు గురయ్యారు. అయితే, బస్సు, వ్యాన్ డ్రైవర్లు ఘర్షణకు దిగడంతో రహదారిపై పెద్దసంఖ్యలో వానాలు నిలిచిపోయాయి. చివరకు ప్రయాణికులు సర్దిచెప్పడంతో ఎవరికి వారు వెళ్లడంతో సమస్య సద్దుమణిగింది.

ఆన్‌లైన్ నమోదు పరిశీలన


వైరా/తల్లాడ/ఏన్కూరు: ప్రజాపాలన సభల్లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఈ సందర్భంగా వైరా తహసీల్దార్ కార్యాలయంలో డేటా ఎంట్రీని గురువారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి కస్తాల సత్యనారాయణకు సూచనలు చేశారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాస్, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే, అదనపు కలెక్టర్ మధుసూదన్ తల్లాడలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులకు ఇబ్బంది తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. వైరా మార్కెట్ కార్యదర్శి ప్రసాద్‌తో పాటు పాషా, ప్రభుదాస్, రాహుల్, సతీష్, అరుణ్, అఖిల్, నర్సింహారావు పాల్గొన్నారు. ఇక మరో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఏన్కూరు తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాపాలన దరఖాస్తులు ఎంట్రీని పరిశీలించగా తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ కృష్ణ పాల్గొన్నారు.

సత్తుపల్లి పాతసెంటర్ పీఎస్ హెచ్ఎం సస్పెన్షన్

సత్తుపల్లి: ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విద్యార్థులను పిక్నిక్‌కు తీసుకెళ్లడమే కాక పాఠశాల పనివేళల్లో ప్రైవేట్ సంస్థ బాధ్యులను సన్మానించడం తదితర కారణాలతో సత్తుపల్లి పాతసెంటర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ డీఈఓ ఈ.సోమశేఖరశర్మ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి డిసెంబర్ 18న పాఠశాల పరిశీలనకు వెళ్లినప్పుడు విద్యార్థులు లేకపోవడంతో ప్రశ్నించగా పిక్నిక్‌కు తీసుకెళ్లామని, ఆ మరుసటి రోజు సెలవు ఇచ్చినట్లు హెచ్ఎం తెలిపారు. అయితే, పిక్నిక్‌కు తీసుకెళ్లడం, సెలవు ఇవ్వడానికి ఎవరి అనుమతి తీసుకోలేదని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఈనెల 2న విచారణ చేపట్టిన హెచ్ఎంను సస్పెండ్ చేశారు. కాగా, విచారణ పూర్తయ్యేవరకు హెచ్ఎం ప్రసాద్ హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లొద్దని ఆదేశించారు. ఇక సత్తుపల్లి పాత సెంటర్ జెడ్పీహెచ్ఎస్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వేము రత్నాకర్‌ను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా తల్లాడ మండలం కుర్నవల్లి జెడ్పీహెచ్ఎస్‌కు డిప్యూటేషన్‌పై పంపిస్తూ డీఈఓ సోమశేఖర్‌శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రవర్తనపై ఫిర్యాదులు రావడంతో విచారణ అనంతరం ఈ చర్యలు తీసుకున్నారు. ఒకే ప్రాంగణంలో ఉన్న రెండు పాఠశాలల ఉపాధ్యాయులపై వేటు పడటం చర్చనీయాంశమైంది.

ఖానాపురం చెరువు శిఖంలో కట్టడాలు కూల్చివేత

అనుమతులు లేవంటూ కూల్చివేసిన అధికారులు


కార్పొరేషన్ అధికారులు కూల్చివేసిన నిర్మాణాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 6వ డివిజన్ పరిధి ఇల్లెందు–ఖమ్మం ప్రధాన రోడ్డులోని ఖానాపురం చెరువును ఆనుకుని(ఎఫ్‌టీఎల్ పరిధి) చేపట్టిన నిర్మాణాలను గురువారం కార్పొరేషన్, జలవనరులశాఖ అధికారులు కూల్చివేశారు. అనుమతులు లేకపోగా, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారని అధికారులు వెల్లడించారు. ప్రహరీలు, రేకుల షెడ్లను ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి ఆధ్వర్యాన బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఆయా కట్టడాల యజమానులు ఇద్దరికి వారం క్రితమే నోటీసులు జారీ చేసిన అధికారులు ఇప్పుడు చర్యలకు దిగారు. అయితే, మూడ్ వెంకన్న తదితరులు మాట్లాడుతూ..ప్రహరీ, రేకుల షెడ్డుకు అన్ని అనుమతులు ఉన్నా అధికారులు కూల్చివేశారని పేర్కొన్నారు. ఖానాపురం సర్వే నంబర్ 231లోని భూమిని 1990లో పట్టాదారు కె.రామకృష్ణ వద్ద నుంచి ఎం.ఆంతోని, వి.కృష్ణమూర్తి కొనుగోలు చేయగా, 2006లో తాను 577 గజాల స్థలాన్ని కొని బల్లేపల్లి పంచాయతీ అనుమతి తీసుకున్నాకే నిర్మాణాలు చేపట్టగా ఇంటి నంబర్ కూడా కేటాయించారని చెప్పారు. గతంలో కోర్టుకు కూడా ఇది పట్టా భూమేనని తీర్పు ఇవ్వగా భవన నిర్మాణం కోసం కార్పొరేషన్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. ఇంతలోనే అధికారులు కూల్చివేయడం సరికాదని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో సీఆర్‌పీకి గాయాలు

కారేపల్లి: కారేపల్లి ఎంఈఓ కార్యాలయంలో సీఆర్‌పీగా విధులు నిర్వర్తిస్తున్న కల్తి ప్రమీల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విధులు ముగిశాక ఆమె స్వగ్రామమైన గిద్దెవారిగూడెం గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో స్థానికులు ఆమెను కారేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న ఎంఈఓ జయరాజు, ఉద్యోగులు ఆస్పత్రిలో ప్రమీలను పరామర్శించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మధిరరూరల్: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. తొండల గోపవరం – ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు... అప్‌లైన్‌లో వెళ్తున్న రైలు నుంచి సదరువ్యక్తిప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆయన వివరాలు తెలిసిన వారు 99636 41484 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

గుర్తు తెలియని వృద్ధుడు..


వృద్ధుడి మృతదేహం

ఎర్రుపాలెం : మండలంలోని మీనవోలు కట్లేరు బ్రిడ్జి కింద గురువారం గుర్తు తెలియని వృద్ధుడి(70) మృతదేహం లభ్యమైంది. బట్టతల కలిగిన మృతుడి శరీరంపై ప్యాంటు, షర్టు, వైట్ కలర్ బనియన్ ఉన్నాయి. ఆయన ఆచూకీ తెలిసిన వారు 87126 59164, 87126 59165 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ఎం.సురేశ్‌సూచించారు.

సోదరుడిపై కత్తితో దాడి

ఖమ్మం అర్బన్: సొంత అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన ఘటన ఖమ్మంలోని అగ్రహారం కాలనీలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. అగ్రహారం కాలనీలో నివాసం ఉంటున్న అన్నదమ్ముళ్లు సంజీవ్‌సింగ్, బహదూర్‌సింగ్ నగరంలోని జెడ్పీ సెంటర్ సమీపాన బీరువాల షాపులో పనిచేస్తారు. బుధవారం రాత్రి ఇంట్లో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో అన్న సంజీవ్‌పై తమ్ముడు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో సంజీవ్‌కు తీవ్రగాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని నగదు స్వాహా

కల్లూరు: ఉద్యోగం ఇప్పిస్తానన్న వ్యక్తి మాటలు నమ్మిన మండలంలోని గోపాలదేవుని బోయిపపల్లి గ్రామవాసి డబ్బులు కట్టి మోసపోయాడు. గ్రామానికి చెందిన గుడిమెట్ల రామకృష్ణకు గత ఏడాది నవంబర్ 28వ తేదీన వాట్సాప్‌లో ఓ మెస్సేజ్ వచ్చింది. ఉద్యోగం ఇప్పిస్తానని ఆ మెసేజ్ పంపించిన వ్యక్తి నమ్మబలకడంతో విడతల వారీగా రూ.1.75 లక్షలు చెల్లించాడు. అయినా ఉద్యోగం ఇప్పించకపోగా ఫోన్ చేసినా స్పందించకపోవడంతో రామకృష్ణ గురువారం చేసిన ఫిర్యాదుతో కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.